# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 17, ఆగస్టు 2026




## విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు

# మెరుగైన భోజనం అందించాలి

**✳ కెజిబివిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కె.హరిత**

జైనూర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:

ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, పరిశుభ్రమైన వాతావరణం, మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. ఆదివారం జైనూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న విద్యా బోధన, వసతులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాల పరిశుభ్రతను కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ పౌష్టికాహారం అందించాలని, వంటశాల, భోజన ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని మిగతా 2లో..



# పేద విద్యార్థులకు పోషకాహారం అందించేందుకు కేంద్రీకృత వంటశాల

**★ నిర్మాణ పనులను పరిశీలించిన మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు**

మంచిర్యాల,ఆగస్టు16, ప్రభాతవార్త

మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కాలేజీ రోడ్డులో గల పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేందుకు హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కేంద్రీకృత వంటశాల నిర్మాణ పనులను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని తెలుసుకుని, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, జిల్లా ఆర్‌జీపీఆర్‌ఎస్ అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, లక్షెట్టిపేట పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల నిరవధిక సమ్మెకు

# సంపూర్ణ మద్దతు



బెల్లంపల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం, ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందితే కుటుంబానికి ప్రమాద బీమా తదితర హక్కుల సాధన కోసం ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెకు బెల్లంపల్లి నియోజకవర్గ ఆటో కార్మికులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాలతో పాటు బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ల సమక్షంలో సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ ఓలా, ఓబర్, ర్యాపిడ్ వంటి యాప్ ఆధారిత రవాణా సేవలకు వ్యతిరేకంగా, పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నిరసిస్తూ నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి డ్రైవర్లకు సామాజిక మిగతా 2లో..

# రేషన్‌కార్డులపై ప్రధాని చిత్రమేదీ..?

**✪ శాశ్వత రాజులా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారు: రఘునాథ్ వెరబెల్లి**

మంచిర్యాల, ఆగస్ట16, ప్రభాతవార్త;

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేస్తున్న రేషన్ కార్డులపై కేంద్ర ప్రభుత్వ అధికారిక ముద్రతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ఏర్పాటు చేయకపోవడాన్ని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి తీవ్రంగా ఖండించారు. మంచిర్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి, మంత్రుల పదవులు శాశ్వతం కాదని, పేదలకు అందించే రేషన్ కార్డులు శాశ్వతమని అన్నారు. కేంద్రం అందిస్తున్న ఉచిత రేషన్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తమ పథకంగా ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాలలు విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదని, ఉద్యోగాలు, ఉన్నత విద్యకు వారు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ చేపట్టిన ఆందోళనలతోనే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పందించిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, గాజుల ముఖేష్ గౌడ్, దుర్గం అశోక్, పెద్దపల్లి పురుషోత్తం, బేర సత్యనారాయణ, గోలి రాము, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# అటల్ జీ సేవలు చిరస్మరణీయం

**✳ నివాళులర్పించిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి**

నిర్మల్, ఆగస్టు 16, ప్రభాతవార్త:



భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 8వ వర్ధంతి సందర్భంగా శనివారం నిర్మల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అటల్ జీ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. అటల్ బిహారీ వాజ్‌పేయి గొప్ప రాజనీతిజ్ఞుడని, దార్శనికుడని కొనియాడారు. పోఖ్రాన్ అణు పరీక్షలతో దేశ భద్రతను బలోపేతం చేయడమే కాకుండా, సర్వశిక్షా అభియాన్ ద్వారా విద్యను అందరికీ చేరువ చేశారని గుర్తుచేశారు. జాతీయ రహదారుల అనుసంధానం, సంక్షేమ పథకాలతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన చూపిన సుపరిపాలన, ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, తక్కల రమణారెడ్డి, ముత్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యం చంద్రకాంత్, పట్టణ నాయకులు కందుల హరీష్, పొడెల్లి గణేష్, డి. శ్రీనివాస్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు

# మెరుగైన భోజనం అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బాలికలు ఆత్మవిశ్వాసంతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థినుల సౌకర్యాలు, భద్రత, ఆరోగ్య పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసి ఆహారం రుచి, నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







## ఆటో కార్మికుల నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

(మొదటిపేజీ తరువాయి)

భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయే ఆటో డ్రైవర్ల కుటుంబాలకు తగిన ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, వార్షిక ఆర్థిక సహాయం అందించాలని కోరారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాలు, బెల్లంపల్లి పట్టణం, సుమారు 60 గ్రామపంచాయతీల పరిధిలోని ఆటో కార్మికులకు సమ్మె ఉద్దేశాలు, డిమాండ్లను వివరించారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు ఏకగ్రీవంగా నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఐక్యంగా పోరాడుతామని వారు స్పష్టం చేశారు.

## ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో ప్రజావాణి

### - ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదుల స్వీకరణ

**బెల్లంపల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇకపై రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లాలోని అన్ని మండల కేంద్రాలతో పాటు ఆయా మండల కేంద్రాల్లో కూడా సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం కానుంది. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు లేదా వారి ప్రతినిధులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు. ప్రజలు అందజేసే ప్రతి ఫిర్యాదుకు రసీదు జారీ చేయడంతో పాటు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతారు. ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను ప్రజావాణి కార్యక్రమంలో నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలని అధికారులు సూచించారు.

## భక్తిశ్రద్ధలతో నాగదేవత విగ్రహ ప్రతిష్టాపన

**బెజ్జూర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:**



బెజ్జూర్ మండలంలోని ఎల్కపల్లి, బెజ్జూర్ గ్రామాల మధ్యన గల నాగులమ్మ చెరువు సమీపంలో ఆదివారం నాగదేవత విగ్రహ ప్రతిష్టాపన ఇరు గ్రామాల ప్రజలు అమిత భక్తితో ఘనంగా నిర్వహించారు. దీంతో బ్రహ్మీ ముహూర్తం నుండి చెరువు పరిసరాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి.

# ముందస్తు పరీక్షలు, క్రమశిక్షణతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం: వైద్య నిపుణులు

### – శ్రీరాంపూర్ 6వ డివిజన్‌లో ఉచిత వైద్య శిబిరం
### – నిర్మల పాలిక్లినిక్, శ్రీ వాసుదేవాయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ



**నస్పూర్, ఆగస్టు 16, ప్రభాతవార్త**

ముందస్తు పరీక్షలు, క్రమం తప్పని ఆరోగ్య పరిరక్షణ ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులను ప్రాథమిక దశలోనే నివారించవచ్చని వైద్య నిపుణులు డాక్టర్ జి. శ్రీకాంత్, డాక్టర్ కుసుమ నిర్మల పేర్కొన్నారు. శ్రీ వాసుదేవాయ హెల్త్ కేర్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్మల పాలిక్లినిక్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ కాలనీలోని 6వ డివిజన్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక 6వ డివిజన్ కార్పొరేటర్ వనపర్తి కేతా రాజేష్, దాత గుత్తికొండ ప్రశాంత్ ప్రత్యేక సహకారం అందించారు. శిబిరంలో స్థానిక ప్రజలకు జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్ వైద్య సేవలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. నిపుణులైన వైద్యులు డాక్టర్ జి. శ్రీకాంత్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కుసుమ నిర్మల రోగులను స్వయంగా పరీక్షించి కుటుంబ ఆరోగ్య సలహాలు అందించారు. పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల స్పృహ కలిగి ఉండాలని సూచించారు. ఈ వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన స్థానికులు వైద్య పరీక్షలు చేయించుకుని సేవలను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ కార్పొరేటర్ తోటపల్లి రాజేశ్వరి, నాయకులు ప్రణయ్, ముక్కెర శ్రీనివాస్, బొజ్జ భూమన్న, శ్రీనివాస్, సంపత్, సాగర్, శ్యామ్, కాలనీ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఘనంగా డిసిసి జన్మదిన వేడుకలు

**ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు16, ప్రభాతవార్త :**

కుమురం భీం జిల్లా డీసీసీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసి కేక్ కట్ చేయగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జన్మదిన వేడుకల సందర్భంగా డీసీసీ కార్యాలయ ఆవరణలో ఆమె మొక్కను నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆమె సూచించారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపిన పార్టీ శ్రేణులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉండాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండలాల అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**బెజ్జూర్, ఆగస్టు 16, ప్రభాతవార్త:**

బెజ్జూర్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు ఆదివారం బిజెపి నాయకులు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ పాల్వాయి హరీష్ బాబు ఆదేశాల మేరకు లబ్ధిదారులకు నేరుగా అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బెనికి శ్యామ్ సుందర్, వసీవుల్లా ఖాన్, సామల తిరుపతి, రాజారాం పాల్గొన్నారు.

# వార్డుల్లో బ్లీచింగ్, క్లోరినేషన్, ఫాగింగ్ చేపట్టాలి

**బెల్లంపల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త**




వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బెల్లంపల్లి పట్టణంలోని 34 వార్డుల్లో పారిశుద్ధ్య చర్యలను ముమ్మరం చేయాలని ఎంసీపీఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఎంసీపీఐయు పార్టీ కార్యాలయంలో ఆదివారం రోజున ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు క్లోరినేషన్ ప్రక్రియ చేపట్టాలని కోరారు. దోమల బెడద పెరుగుతున్నందున 34 వార్డుల్లో వెంటనే దోమల నివారణ మందు ఫాగింగ్ చేయించాలని అన్నారు. మురుగు కాలువలను శుభ్రం చేసి, నిల్వ ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాలని సూచించారు. పారిశుద్ధ్య లోపాల కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. అదేవిధంగా పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేస్తున్న తినుబండారాల బండ్లను అధికారులు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఆహార పదార్థాలను విక్రయించే సమయంలో పరిశుభ్రత పాటిస్తున్నారా, దోమతెరలు ఏర్పాటు చేశారా, నాణ్యమైన పదార్థాలు, నూనెలను వినియోగిస్తున్నారా అనే అంశాలను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఫుడ్ ఇన్స్పెక్టర్ లేకపోవడం వల్ల ఆహార పదార్థాల నాణ్యతపై పర్యవేక్షణ లోపిస్తోందని పసులేటి వెంకటేష్ పేర్కొన్నారు. కల్తీ నూనెలు, నాణ్యత లేని పదార్థాలతో ఆహారాన్ని తయారు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని 34 వార్డుల్లో బ్లీచింగ్, క్లోరినేషన్, దోమల ఫాగింగ్‌తో పాటు పారిశుద్ధ్య చర్యలు తక్షణమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.



## బెల్లంపల్లిలో మండి మహల్ షాప్ ప్రారంభోత్సవం

**బెల్లంపల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని 11వ వార్డులో కుర్రే నవీన్ నూతనంగా ఏర్పాటు చేసిన మండి మహల్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు హాజరై రిబ్బన్ కట్ చేసి షాప్‌ను ప్రారంభించారు. స్థానిక వార్డు కౌన్సిలర్ గాలి సుమలత-శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నూతనంగా వ్యాపారం ప్రారంభించిన కుర్రే నవీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతూ మంచి పేరు, ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు దీకొండ పద్మ-రాయలింగం, బేతి శ్రావణ్ కుమార్, కౌన్సిలర్ తిరుమల వాసు ధరావత్, నాయకులు పీక లక్ష్మణ్, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నూరి ఓదెలుకు నివాళులు

**బెల్లంపల్లి, ఆగస్టు 16, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని 15వ వార్డులో సీనియర్ నాయకులు కన్నూరి వెంకటేష్ తండ్రి, స్వర్గీయ కన్నూరి ఓదెలు తొలి వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు హాజరై, కన్నూరి ఓదెలు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బేతి శ్రావణ్ కుమార్, సీనియర్ నాయకులు శంకర్ సింగ్, బండి రాము, లక్ష్మణ్ సోదరులు, సబ్బని రాజానర్సు, వాజీద్, గెల్లి రమాకాంత్ తదితరులు పాల్గొని కన్నూరి ఓదెలు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## విద్యార్థుల పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త :**

విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యూ కొమురం భీం జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి డిమాండ్ చేశారు. ఆదివారం జనకపూర్‌లో నిర్వహించిన ఆసిఫాబాద్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ కళాశాలల్లో బకాయిల కారణంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతో పాటు ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు షేక్ సమీర్, శివశంకర్, బౌరే వసంత్, సిరాజ్, మడవి సమీర్ తదితరులు పాల్గొన్నారు



## జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 16, ప్రభాతవార్త :**

సెప్టెంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌లో నిర్వహించనున్న 13వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ కొమురం భీం జిల్లా కార్యదర్శి గోగార్ల తిరుపతి పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు చేస్తున్న అనుకూల విధానాలతో కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేసి, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ మహాసభలకు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ భారత్ మహాసభ జిల్లా అధ్యక్షురాలు పెందూర్ ప్రియాంక, కొమురం భీం జిల్లా అధ్యక్షురాలు సిడం శ్రీదేవి, సిడం నగేష్, చాకటి దుందేరావు, ప్రియా, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి గోగార్ల తిరుపతి

## నేటి నుంచి ప్రజావాణి అర్జీల స్వీకరణ

**బెజ్జూర్, ఆగస్టు 16, ప్రభావత వార్త:**

బెజ్జూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నేటి నుండి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బిఎస్ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు అర్జీలను స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై అర్జీలు పెట్టుకోవచ్చని అన్నారు. ఇట్టి సదా అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కళ్యాణికి మున్నూరు కాపు సంఘం పరామర్శ

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 16, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడ గ్రామానికి చెందిన కుందరపు కళ్యాణి అనారోగ్యంతో పట్టణంలోని ప్రజలైఫ్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం పటేల్స్ అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ ఆసుపత్రికి వెళ్లి కళ్యాణిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం వైద్యులను కలిసి కళ్యాణి అనారోగ్యానికి సంబంధించిన వివరాలను తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బోలిశెట్టి మహేష్, జిల్లా కార్యదర్శి అంగాల తిరుపతి, పార్వతి సురేష్, దర్ని రామయ్య, గజ్జి శ్రీనివాస్, కాశెట్టి సత్యనారాయణ, పార్వతి శంకర్, గజ్జల జగదీష్‌తో పాటు గజ్జిగూడ గ్రామానికి చెందిన మున్నూరు కాపు సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

## భైంసాలో ఘనంగా వాజ్‌పేయి వర్ధంతి

### - నివాళులర్పించిన ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావు పటేల్

**నిర్మల్, ఆగస్టు 16, ప్రభాతవార్త:**

భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆదివారం భైంసా పట్టణంలోని జీన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ ఫ్యాక్టరీలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ప్రజా ట్రస్ట్ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు మోహన్ రావు పటేల్ వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మోహన్ రావు పటేల్ మాట్లాడుతూ.. వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్గిల్ యుద్ధంలో దేశ ప్రతిష్టను నిలబెట్టడం, అణు పరీక్షలు నిర్వహించడం, స్వర్ణ చతుర్భుజి రహదారి ప్రాజెక్టు, సర్వమత సమభావం ఆయన దార్శనికతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆయన ఆదర్శాలు, సుపరిపాలనా విధానాలు నేటికీ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. అనంతరం ఆయన సేవలను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ముధోల్ మాజీ ఎంపీపీ సుభాష్ జాదవ్, స్థానిక ప్రైవేట్ ఉద్యోగులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

